# కొత్త మంచం

*

* రచన: శ్రీ బచ్చు వీర్రాజు *



(రచయిత)

ఉదయం ఆరు గంటలయింది. నెమ్మదిగా మంచం దిగి ఓసారి ఒళ్ళు విరుచుకొన్నాను.

అప్పుడే దేవుడి గదిలోంచి, శ్రీమతి "సుబ్రహ్మణ్యేశ్వర స్తోత్రం" శ్రావ్యంగా పఠిస్తోంది.

అలాగే నిలబడి, శ్రద్ధగా ఆలకించ సాగాను.

ఇంతలో....మిత్రుడు మోహన్, హడావుడిగా, మా యింట్లోకి రావడం కంట బడింది.

"ఏమిట్రా అంత కంగారు? ఏమిటి విశేషం?" అని ప్రశ్నిస్తూ వాడికి ఎదురు నడిచాను.

పూజ పూర్తి గావడంతో శ్రీమతి కూడా గదిలోంచి హాలులోకి వచ్చింది.

"విశేషమే! ఈ రోజు రాత్రే నేను కట్టుకొన్న కొత్త ఇంటి గృహప్రవేశం అన్న సంగతి మర్చిపోయావుట్రా?" నిలదీసి అడిగాడు.

"గుర్తుంది లేరా! మర్చి పోలేదు...." అన్నాను నవ్వుతూ.

"చెల్లెమ్మా! నువ్వు దగ్గరుండి, చెవి మెలేసి మరీ వీడిని లాక్కు రావాలి. తెలిసిందా?" శ్రీమతి వంక చూసి అన్నాడు.

"అలాగే అన్నయ్యా!" అంటూ శ్రీమతి వంటింట్లోకి నడిచి వెంటనే రెండు కాఫీ కప్పులతో తిరిగి ప్రత్యక్షమయింది.

మోహన్ కాఫీ కప్పు అందుకుంటూ ఓసారి శ్రీమతి వంక చూశాడు.

"ఇదిగో, చెల్లెమ్మా! నువ్వూ, మా వాడూ తప్పకుండా రావాలి సుమా! మర్చిపోయేరు గనుక...." అభిమానంతో మరోసారి గుర్తు చేశాడు మోహన్.

"అలాగేలే అన్నయ్యా! తప్పకుండా వస్తాం." శ్రీమతి భరోసా యిచ్చేసింది.

నేను నవ్వుతూ తల వూపాను.

కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి వెళ్ళిపోయాడు మోహన్.

* * *

సాయంత్రమయింది. గబగబా బజారుకెళ్ళి ఓ 'స్టీల్ ప్లేట్' కొనుక్కుని వచ్చాను.

శ్రీమతి దానిని చూసి "బాగుంది మీ సెలక్షన్!" అంటూ ఓ కాంప్లిమెంట్ విసిరింది మెచ్చుకోలుగా.

నవ్వి వూరుకున్నాను.

శ్రీమతి టాయిలెట్ పూర్తి కాగానే, రిక్షామీద మోహన్ ఇంటికి బయలుదేరాం.

* * *

మమ్మల్ని చూడగానే మోహన్ దంపతులు, ఎంతో ఆప్యాయతను కనబరుస్తూ లోపలికి తీసుకెళ్ళడం, మా ఇద్దరికీ ఆనందమయింది.

నెమ్మదిగా లోపలికి నడుస్తూ, యింటినంతటినీ పరీక్ష పెట్టసాగాం.

మోహన్ కట్టిన ఆ కొత్తయింట్లో ప్రతి వస్తువూ కూడా ఎంతో పొందికగా, అందంగా అమర్చబడింది.




DHARAPURAM ROAD,
TIRUPUR — 638 604.

మా యిద్దరి కళ్ళూ మోహన్ బెడ్ రూమ్‌లోని ఓ వస్తువుపై పడ్డాయి.

అది 'సన్ మైకా' తో చెయ్యబడ్డ డబుల్ సైజ్ కాట్. చక్కటి నీలిరంగు పువ్వుల డిజైన్‌తో మిలమిలా మెరిసిపోతోంది.

నాకూ, శ్రీమతికీ మనసులో ఆ 'సన్ మైకా మంచం' ప్రింటు అయిపోయి, మమ్మల్ని నిలవకుండగా చేసెయ్య సాగింది.

ఆ మంచాన్ని తదేక దృష్టితో చూస్తున్న శ్రీమతి భుజం తట్టి హాలులోకి నడిచాను.

* * *

కొంత సేపటికి గృహప్రవేశ కార్యక్రమం మొదలయింది. రంగు-రంగుల దీపాలతో, బయట షామియానాలో, వేద పండితుల మంత్రోచ్చారణతో ఆ నూతన గృహం వింతశోభను ప్రసరింప జేస్తుంటే, నాలో కాస్త ఈర్ష్య చోటు చేసుకో నారంభించింది.

ఆ తతంగం పూర్తి కాగానే, భోజనాలు చేసి శ్రీమతీ, నేనూ మోహన్ దంపతుల వీడ్కోలుతో బయటకొచ్చి పడ్డాం.

ఈ కార్యక్రమం పేరు చెప్పి మోహన్ దంపతులకు చాలా బహుమతులు రావడం శ్రీమతీ, నేనూ గమనించాం.

* * *

ఇంటికి రాగానే, 'సన్‌మైకా మంచం' మీద చర్చ మొదలయింది నాకూ, శ్రీమతికీ.

మోహన్ స్థితి ముందు, నా స్థితి నామమాత్రమే అయినా ఆ మంచంమీద మాకు ఏర్పడిన మక్కువతో గబ-గబా బడ్జెట్ తయారు చెయ్యడం మొదలెట్టాం.

సినిమాలూ, కాఫీ, టిఫిన్ల ఖర్చులూ తగ్గించి, ప్రతి నెలా ఓ వంద రూపాయలు ఆదా చేసి, ఓ ఎనిమిది నెలల తర్వాత 'సన్‌మైకా' మంచాన్ని సాధించాలని ఓ గట్టి పథకాన్ని వేశాం.

శ్రీమతి నిట్టూరుస్తూ లోపలికి నడిచింది.

కాసేపటికి బట్టలు మార్చుకొని బెడ్ రూమ్‌లోకి దారి తీశాను.

ఓసారి మా మంచంవైపు దృష్టి నిలిపాను.

అది పట్టె మంచం, ముళ్ళు వేసి బిగించిన నవారుతో, శిథిలావస్థలో వున్న చింకి పరుపుతో దీనంగా పడివుంది.

కోపంతో ఒక్క తన్ను తన్నాను. వెంటనే ఓ ప్రక్క కోడు 'టప్' మని క్రింద పడిపోయింది.

గబగబా దానిని యథాస్థానంలో వుంచి, దానిపైకి చింకి వరుపును లాగి, మంచంమీద కూలబడ్డాను.

అది 'కిర్రు-కిర్రు'మంటూ ఉయ్యాల వూగడం మొదలు పెట్టింది.

ఇంతలో శ్రీమతి వచ్చి మంచంమీద కూర్చోబోయింది. నేను గమ్మని వారిస్తూ "ఆగాగు. ఇది టూ-యిన్-వన్ కాదు. ఓన్లీ-వన్-యిన్-వన్. మకాం క్రిందకు మార్చెయ్...." అని అరిచాను.

శ్రీమతి నవ్వుకుంటూ, మకాం క్రిందకు మార్చే ప్రయత్నాన్ని మొదలు పెట్టింది.

* * *

ఎనిమిది నెలలు అతి భారంగా గడిచాయి.

ఎనిమిది వందలు ప్రోగు పడ్డాయి.

ఓ మంచిరోజు చూసి, వడ్రంగి మేస్త్రిని పిలిచి సన్ మైకాతో, మంచం చెయ్యమని పురమాయించాం.

అది ఎనిమిది వందలు దాటకుండగా, ఓ వారం రోజులకు పూర్తి కాగానే, మా యిద్దరి ఆనందానికి హద్దులేకుండగా పోయింది.

వెంటనే పాత మంచం విరగ్గొట్టి మరీ అటక ఎక్కించేశాను.

* * *

మరో మంచిరోజున, యింట్లోవున్న పాత పరుపులో, మరి కాస్త దూది వేయించి, కొత్తగుడ్డతో కొత్తపరుపుగా కుట్టిస్తూ ఆ మంచంమీద పరిచాం.

ఆ రోజే మా "కొత్త మంచం", ఓపెనింగ్ చేసే రోజు. ఇల్లంతా కడిగి చక్కగా ముగ్గులు పెట్టేసింది శ్రీమతి.

మంచం మిల-మిలా మెరిసిపోతోంది. చాలా చక్కగా తయారయింది. వడ్రంగి మేస్త్రికి మనసులోనే ధన్యవాదాలు చెప్పుకొన్నాం.

అకుపచ్చ రంగు పువ్వులదుప్పటి, ఆ మంచానికి ఎంతో విందు యివ్వడంతో, ఆ మంచం మరింత కళ-కళ లాడ సాగింది.

* * *

చీకటి పడసాగింది.

గబ-గబా భోజనాలు ముగించి, శ్రీమతితో ఒకేసారి ఆ మంచంపై 'రంగ ప్రవేశం' చెయ్యాలని తహతహలాడి పోతున్నాను.

టైమ్ రాత్రి ఎనిమిది గంటలయింది.

"SELEKT" Motors and Pumps

IS 325



For :– EFFICIANCY, ECONOMY AND TROUBLE FREE SERVICE



Manufactured by :

Chitra Industries

COIMBATORE – 641 005.

Grams: "SELEKT PUMP" Phone: 24548

—: సేల్స్ బ్రాంచ్ :—

చిత్రా యిండస్ట్రీస్

5-1-446, రాణిగంజ్,


సికిందరాబాద్-3 (ఎ.పి.) ఫోన్: 77828

డిస్ట్రిబ్యూటర్స్ :

లక్ష్మి ఏజెన్సీస్

రాణిగంజ్ : : సికిందరాబాద్-3.

THERE IS JOY
WHERE THERE IS




JOTHI
Engineering Works
INDUSTRIAL ESTATE,
MADURAI - 625 007.

—ATHMAS

శ్రీమతి హుషారుగా కూనిరాగాలు తీస్తుంటే, నా మనసు ఆకాశంలో విహరించ సాగింది.

భోజనాలయ్యాయి. వంటిల్లు సర్దడంలో శ్రీమతికి సాయంగా నిలిచాను.

సర్దడం పూర్తి కాగానే, శ్రీమతి వడుం చుట్టూ చెయ్యి వేసి, శ్రీమతి జడలోని మల్లెలు గుభాళిస్తుంటే మత్తెక్కే కోరికలతో బెడ్ రూమ్ వైపుకు దారి తీశాను.

ఇంతలో ....

'దబ్-దబ్' మని వీధితలుపు చప్పుడయింది.

శ్రీమతి గబగబా నన్ను విడిపించుకొని ఆ వైపుకి పరుగెత్తింది. నేను అలాగే నిలబడి పోయాను మనసులో విసుక్కుంటూ.

తలుపు తెరిచిన చప్పుడయింది.

"అరె, నువ్వా నాన్నా! రా, రా! అమ్మా, తమ్ముళ్ళూ కులాసాయేనా?" శ్రీమతి కంఠం వినిపించింది.

"ఆఁ-ఆఁ....కులాసాయే తల్లీ! అల్లుడుగారున్నారా?"

అది మా మావగారి కంఠం. సంగతి అర్థమయింది. ఒక్కసారిగా "గోవిందో హరి" అంటూ కూలబడి పోయాను.

వెంటనే ఇంక బాగుండదని ఎదురెళ్ళి "రండి-రండి! ఇదేనా రావడం?" అని ప్రశ్నించాను ఏడ్వలేక నవ్వుతూ.

"ఆఁ-ఆఁ....యిదే రావడం! ఆఁ-చూడు అమ్మాయ్! ఈరోజు శనివారం. భోజనం చెయ్యను. దారిలోనే టిఫిన్ చేసి వచ్చాను. అనవసరంగా కంగారుపడి ఏమీ చెయ్యకు."

"అలాగేలే నాన్నా! కొద్ది పాలున్నాయి, ఇస్తాను." అంటూ శ్రీమతి వంటింట్లోకి నడిచింది.

ఆయన దొడ్లో నూతిదగ్గర కెళ్ళడం చూసి, నేను శ్రీమతి దగ్గరకు దూసుకు పోయాను.

"కొత్తమంచం ఓపెనింగ్ గోవిందా!" అరిచాను నెమ్మదిగా.

"ఛా-వూరుకోండి. ఎవరయినా నవ్వుతారు. రేపెళ్ళి పోతాడుగా."

"చాల్లే నోర్ముయ్! ఆఁ....వచ్చింది మా బాబు కాదు; మీ బాబు."

"అయితే...."

"వారం రోజులు తిష్ఠ గ్యారంటీ. డబ్బాల్లోని సరుకులతో బాటు నువ్వూ, నేను ఖాళీ అయిపోయేదాకా అంగుళం కూడా కదలడు."

"హుష్ .... వూరుకోండి. ఆయన వింటాడు. అది సరే.... ఆయన పడక ఎక్కడ ....?"

"ఉందిగా - చచ్చి చెడి చేయించిన ఆ కొత్తమంచం. దానిమీదే అఘోరించమను. మన 'నేలబ్రతుకు' మన కుందిగా!"

"ఊఁ.... సర్లెండి." శ్రీమతి విసుక్కుంది.

ఆయన లోపలకు రాగానే మా కంఠాలు మూత పడ్డాయి.

*　　*　　*

నేను అన్నట్లుగానే, ఆయన ఓ వారం రోజులకు గాని మా యిల్లు వదిలి పెట్టలేదు. వెడుతూ మా కొత్తమంచాన్ని ఎంతో పొగిడి మరీ వెళ్ళాడు. మా అదృష్టంకొద్దీ ఆయన వెళ్ళిపోయిన రోజు, పంచమీ సోమవారం కావడంతో మేమెంతగానో సంబర పడిపోయాం.

తిరిగి చీకటి పడగానే, ఆ మంచం ఓపెనింగ్ చెయ్య డానికి మళ్ళీ ఉల్లాసంగా ప్రయత్నాలు మొదలుపెట్టాం.

ఈసారి వినాయకుడికి ఓ వెయ్యి నమస్కారాలు పెట్టి యిద్దరం బెడ్ రూమ్‌లో ప్రవేశించాం.

సాయంత్రం బజారునుంచి తెచ్చిన మల్లెపూలు కొన్ని మంచంమీద జల్లి, మరికొన్ని శ్రీమతి కందిస్తుండగా— "సార్ .... సార్ !" అన్న కేక వినిపించింది.

నా గుండె గుభేలుమంది.




"ఏమండీ ... ఎవరో మనల్నే పిలుస్తున్నారండీ!" శ్రీమతి ఆత్రుతగా అంది.

"వాడి శ్రాద్ధం. ప్రక్కింటోళ్ళనై వుంటుంది. నువ్వు ఇలా అఘోరించు. మళ్ళీ వర్జ్యాలేడుస్తాయి." అన్నాను విసుగ్గా.

ఇంతలో, బయట పిలుపులో బాటు తలుపు చప్పుడు కూడా మొదలయింది గట్టిగా.

"నేను చెబితే విన్నారా—అది మనల్నేనని?" శ్రీమతి విదిలించుకొని బయటకు నడిచింది.

'ఏలిననాటి శని నన్ను యింకా వదిలి పావనట్లుంది!' అనుకుంటూ, నేను కూడా ఆవైపుకు తగులడ్డాను.

NOVEL DIAMONDS
NOVEL DIAMOND WORKS

నోవెల్ వజ్రములు
నగలను అలంకరించుటకు
విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.
అన్ని విధములైన కలర్ కమలములూ
మా వద్ద దొరుకును.
మా వజ్రములకు గ్యారంటీ ఇవ్వబడును.

—: వివరములకు :—

Phone No. 27468

Novel Diamond Works

7-A/2, North Sowrastra St. : TIRUCHIRAPALLI . 620 008.




"సార్....నైట్ డ్యూటీ మనిషి రాలేదంట! ఎస్.ఎమ్. గారు మిమ్మల్ని అర్జెంటుగా వచ్చి డ్యూటీ పికప్ చెయ్యమని 'మెమో' యిచ్చారు." అన్నాడు ఒగురుస్తూ మా ప్యూన్ రంగసామి.

'ఏడవలేక పోయాడు.' అని మనసులో అనుకొని— "సరేలే....నువ్వెళ్ళు!" అంటూ ఆ 'మెమో' అందుకొని లోపలకు నడిచాను.

టైమ్ చూశాను. రాత్రి తొమ్మిదయింది. గబగబా బట్టలు మార్చుకొని, ఓసారి శ్రీమతి వంక చూశాను.

శ్రీమతి తల వంచుకొని, దిగాలుగా నిలబడింది.

"ఏం చేస్తాం! బహుశా ఆ మేస్త్రీ వెధవ ఆ మంచం చేసినంత కాలం స్నానం చేసివుండడు." అన్నాను కసిగా.

"అలా కాదండీ! ఈ సారి వినాయకుడికి ముందే కొబ్బరికాయి కొడితే ఎలా వుంటుంది?"

"మన ప్రక్కింటాయన ముఖంలా వుంటుంది. అయినా మంచం చేయించేటప్పుడు కొట్టి ఏడిచాం గదా! మళ్ళీ దేనికి?"

"అయినా సరే, మళ్ళీ కొడదాం."

"రేపు షష్ఠి మంగళవారం అయింది. ఇదో ఖర్మ! తిరిగి ఎల్లుండి సప్తమీ బుధవారం దాకా ఆగి ఏడవాలి."

"సరే, మీరు వెళ్ళరండి. టైమైనట్లుంది!"

"ఊఁ....తెలుసులే. నువ్వు తలుపేసుకొని తగులడు." అంటూ విసుక్కుంటూ బయటకు నడిచాను.

* * *

ఆ మరునాడు కూడా మేము నేలబ్రతుకే గడిపాం.

తెల్లవారింది. ఆ రోజే సప్తమీ బుధవారం. వర్జ్యం ముహూర్తం దివ్యంగా వుంది.

ఇద్దరం ప్రొద్దున్నే లేచి తలంటు స్నానాలు చేసి, ఇల్లంతా చక్కగా సర్దేశాం.

నేను వెంటనే ఆఫీస్‌కెళ్ళి మూడు రోజులు సెలవు గ్రాంటు చేయించుకొని వచ్చేశాను.

ఈ లోపుగా శ్రీమతి వినాయకుడికి కొబ్బరికాయ కొట్టి నైవేద్యం పెట్టి, నేను రాగానే ప్రసాదం నా చేతి కందించింది.

నేను హుషారుగా ఈల వేసుకుంటూ, శ్రీమతి వంక చిలిపిగా చూసి ప్రసాదం అందుకొన్నాను.

* * *

చీకటి పడసాగింది....

నేను బజారుకెళ్ళి మల్లెపూలూ, సంపెంగలూ తెచ్చి, శ్రీమతి చేతిలో పెట్టాను.

శ్రీమతి గబగబా వంట పూర్తి చేసింది.

గబగబా శ్రీమతి, నేనూ భోజనాలు పూర్తి చేశాం. వంటయిల్లు సర్ది శ్రీమతి నెమ్మదిగా గదిలోకి ప్రవేశించింది. నేను కొత్తమంచం మీద హుషారుగా, విడిగా కట్టించిన మల్లెపూలు జల్లసాగాను.

ఇంతలో—

"ఉండండి. ఇప్పుడే వస్తాను.' అంటూ శ్రీమతి దొడ్లోకి దారి తీసింది.

కొంతసేపు గడిచింది. శ్రీమతి యింకా తిరిగి రాలేదు. నాకు మతి పోయినట్లయింది.

"ఏమండోయ్! కొత్త ఆ బాపా-చెంబూ నా ముఖాన తగలెయ్యండి. మొదలయింది మూడు రోజుల పండగ." అన్న శ్రీమతి మాటలు నా కర్ణపుటాల్ని దూసుకుపోయాయి.

అంతే! ఒక్కసారిగా 'ధబేల్'మని మంచం మీదనుంచి క్రిందకు కూలబడ్డాను.

"సరిగ్గా దశమినాడే పీడ. ఆ రోజు కూడా మంచిదే గదండీ" శ్రీమతి యింకా ఏదో చెప్పుకు పోసాగింది. నాకు 'స్పృహ' లేదు. అదెప్పుడో గాలి తప్పింది.

